# ఎవరు...?

వడలి రాధాకృష్ణ

**వర్ధని ఆలోచనలు రోజులాగే ఆవిడను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఒకటికి మరొకటి పొంతన లేకుండా ఉన్నాయి. చాలా అసహనానికి లోన వుతోంది. రోజూ ఉండే నిరాశ నిస్ప్రహ, భయం, ఆందోళన అన్నీ నెలకొని ఉన్నాయి.**

"ఈ కష్టాలు పగవాళ్ళకి కూడా వద్దు దేవుడా" అనుకుంది మనసులో. లేకుంటే ఈ ఆరు పదుల వయసులో కృష్ణారామా అనుకోవాల్సింది. కానీ ఎన్ని కష్టాలు కన్నీళ్ళు, అవమానాలు అనునిత్యం మనసులో మంటలు.

ఒక్కసారి నిస్సత్తువ ఆవహించింది వర్ధనిలో. ఇల్లంతా ఒక్కసారి కలియజూసుకుంది.

తన కొంప రోజూ చూసుకుంటూన్న కొంపే. కానీ చూసిన ప్రతిసారీ తనలో ఏవో జ్ఞాపకాలు తద్వారా భయం, బాధ.

ఈ అంతర్మథనం ఈ మధ్య కాలంలో ఎందుకో ఎక్కువవుతోంది వర్ధనిలో.

"వ్యాన్ ఇంకా రాలేదు" టైము చూస్తూ అంది వర్ధని.

గోడ గడియారం ఏడు నలభై ఐదు చూపిస్తోంది.

"పావుగంట టైము ఉందంతే" ఆత్రుతగా అంది.


"బామ్మా! స్కూలుకి టైము అవుతోంది. వ్యాన్ రాలేదు ఆటోమీద వెళతాను" బుక్స్ బ్యాగ్ కేరియర్ తీసుకుంటూ అన్నాడు బాలి. బుల్లి ఇంకా రెడీ కాలేదని తొందరపడుతోంది.

"బుల్లికి జ్వరం తగ్గినట్లు లేదు. ఈ రోజుకి లీవ్ రాసి టీచర్‌కి ఇస్తాను" మనవడు కంగారుగా కదిలిపోయాడు.

"నిండా బొడ్డు ఊడలేదు వాడికి. అప్పుడే ఎన్ని బాధ్యతలో" చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది వర్ధనికి. అనుకున్న ప్రతిసారీ రాజీపడుతూనే ఉంది. ఆ కొరతను ఏదోలా పూడ్చుకోవడానికి ప్రయత్నం చేస్తూనే ఉంది.

భవిష్యత్తు అంతా అంధకారం, అగాధంలా తోచింది వర్ధనికి. ఒక ప్రక్క ముసలితనం ఆవిడను క్రుంగదీస్తోంది. లేకపోతే కన్న కొడుకుల పంచన చేరి కాలం వెళ్ళబుచ్చుకోవాల్సిన సమయం ఇది.

"ఈరోజు పన్నెండు గంటలకి స్టేషన్‌కి రావాలి. నీతో మాట్లాడాలట. యస్.ఐ.గారు కబురు పెట్టారు. " బయట కానిస్టేబుల్ పిలుపుతో అటు తిరిగింది. మనసులో గుబులు మాటల్లో తెలవకూడదని జాగ్రత్త పడుతోంది. కానీ నోట మాట వస్తేగా!



"మరలా స్టేట్‌మెంట్ తీసుకోవాలట. వస్తావు కదూ! లేకుంటే ఆ కపర్ధీ గారు నామీద పడ్తాడు. అసలే తిక్కమనిషి'. తెచ్చిన వారెంట్ మీద సంతకం చేయించుకుంటూ అన్నాడు కానిస్టేబుల్.

వర్ధని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

జీవచ్ఛవమైన బ్రతుకులో ఇవి ఆరని చితిమంటలు. ఒక్కసారి శశి గుర్తుకు వచ్చాడు. గుండె కలుక్కుమంది. చెట్టంత కొడుకు వ్యాధిబారిన పడి కళ్ళముందే కూలిపోయాడు. అంతకన్నా తన బ్రతుక్కి ఆవేదన ఇంకేమి ఉంటుంది? ఏపుగా పెరిగిన వటవృక్షం ఉత్తి పుణ్యాన వేళ్ళతో పెళ్ళగింపబడింది.

అసలు ఆనాడు భర్త పోయిన సంవత్సరానికే విధి శశిని కాటేయడం తీరని వేదనగా మిగిలిపోయింది వర్ధనిలో. కుటుంబమంతా తల్లడిల్లిపోయారు. అంతవరకూ నెలకొన్న ఆనందమంతా ఆవిరైపోయింది. జీవనోత్సాహం కొడిగట్టి బ్రతుకు బండరాయిలా మారిపోయింది.

ముత్యాలులాంటి ఇద్దరు మనవలు. రత్నంలాంటి కోడలు మిధున దిక్కులేనివాళ్ళయి పోయారు. తలచుకుంటే గుండె తరుక్కుపోతోంది.

పెద్దకొడుకు సత్యంకు ఎక్కడో కురుక్షేత్రంలో ఉద్యోగం. "అమ్మా నీ ఆరోగ్యం జాగ్రత్త. అక్కడి సమస్యలు అవే చక్కబడతాయిలే. ఆలోచించి రోగాల్ని కొనితెచ్చుకోకు. పోనీ ఇక్కడికి వచ్చేయ్ కూడదూ! అందరం కలిసి ఉందాము" ఫోన్ పలకరింపులు తప్ప కురుక్షేత్రం నుండి కమలాపురం వచ్చేది తక్కువ. దానికి తోడు ఆనాడు శశికి ఉన్న ఊరులో ఉద్యోగం. మసలిన ఊరు. తెలిసిన మనుషులు కావడంతో సాధారణంగా వర్ధని శశిగారి ఇంట్లోనే ఎక్కువగా ఉండేది.

ఇక మిధున విషయానికొస్తే మొదట్లో మంచిపిల్ల అనే చెప్పొచ్చు. ముసలి అత్త మామగారల పట్ల అణుకువగానే ఉండేది. పిల్లల్ని కూడా బాగానే చూసుకునేది.

భర్త వ్యాధిబారిన పడటంతో సేవలు బాగానే అందించింది. ఎంత కంటికి రెప్పలా చూసుకున్నా శశి



మరణం ఆమె జీవితంలో అనుకోని పెను మార్పులకు నాంది అయింది.

భర్త ఉద్యోగం మిధునకు లభించింది. మరో ప్రక్క వయసు యవ్వనం ఊహలు శారీరక అవసరాలు జోరీగల్లా ఆమె అంతరంగాన్ని చుట్టు ముడుతూండేవి. ఊపిరాడని సుడిగుండంలో అతలాకుతలమవుతూన్న మిధున పసిపిల్లలు. వారి ఆలనా పాలనా పెంపకం చదువు సంధ్యలు అనేబాధ్యతల నుండి వేరుకాసాగింది.

తను, తన చుట్టూ ఉన్న సమాజం ఒక విధంగా తనవారి నుండి దూరంగా నెట్టివేసిందని చెప్పొచ్చు.

ఒక మనిషిగా, శశికి భార్యగా మిధునను వర్ధని ప్రేమగానే చూసుకునేది. కానీ కొడుకు అకాలమరణం తర్వాత కోడలి భవిష్యత్తు గురించి పెద్దగా ఆలోచన చేయలేకపోయింది.

క్రమంగా నీలకంఠం రంగప్రవేశం మిధున ప్రవర్తనలో మార్పును తీసుకొచ్చింది. అతను మిధున పనిచేసే ఆఫీసులో యల్.డి.సి.గా పని చేసేవాడు. భార్య, పిల్లలు సంసారం కలిగిన నీలకంఠం మిధునతో స్నేహానికి ఉత్సాహం చూపేవాడు.

ఆకట్టుకునే ఆ మాటలు ఆమెను అలరింప చేసేవి. మనసును ఆకట్టుకునేవి. కావాలని పని కట్టుకుని పలకరించడాలు, పూసుకు తిరగడాలు మొదట్లో ఇష్టం చూపించకపోయినా తర్వాత నీలకంఠం పన్నిన ఉచ్చులో ఇరుక్కుపోయింది. మిధునను, మిధున జీవితాన్ని పూర్తిగా ఆక్రమించుకున్న నీలకంఠం క్రమంగా ఆమెపై ఆధిపత్యాన్ని చెలాయించే స్థాయికి ఎదిగాడు.

ఆమె బ్రతుకును తన చెప్పుచేతల్లోకి తీసుకోవడం, ఆ ఇంటి నుండి అవి కావాలి ఇవి కావాలి అని నయాన్నో భయాన్నో తెప్పించుకోవడం చేసేవాడు. విషయం నలుగురికీ తెలిసిపోయింది.

అగ్గిమీద గుగ్గిలంలా చెట్టంత కొడుకును పోగొట్టుకున్న వేదనలో ఉన్న వర్ధనిని కోడలు చేసిన నిర్వాకం నిలువునా కూల్చివేసింది.

“వర్ధనమ్మగారి కోడలు నీలకంఠంతో లేచిపోయిందన్నమాట ...” ఊరంతా దావానలంలా పొక్కిపోయింది. ఎన్నో సంవత్సరాలుగా సంఘంలో సంపాదించుకున్న పరువు ప్రతిష్టలు మంటగలిసిపోయాయి. భర్తపోయిన బాధకన్నా, శశి రోగం బారిన పడిన విషయం కన్నా, కోడలు తెచ్చిన అప్రదిష్ట తలదించుకు నేలా చేస్తోంది. అదీ కులం గోత్రం తెలియని ఎవడో అనామకుడితో బరితెగించి..

అవకాశమొచ్చిందికదా అని పొగిడిన చేతులే పొగపెట్టడం మొదలుపెట్టాయి.

“ఎంత మొగుడు పోతేమట్టుకు మరీ ఇంత తెగింపా?” ఆడంగుల చాటుమాటు గుసగుసలు.

“మనమేనా ట్రై చేయాల్సింది. ఛాన్సు ఎవడో తన్నుకుపోయాడు. చూస్తూ మనం చేతకాని వాళ్ళులా ఉండిపోయాం” మగరాయుళ్ళ తెగింపు మాటలు, ఆ నోటా ఈనోటా వర్ధని చెవిని పడుతూనే ఉన్నాయి. కానీ తను ఏమీ చేయలేని అశక్తురాలు, ఏమీ అనలేని అల్పురాలు.

“ఆమె బట్టలు నగలు ఇక్కడ మిగిలి ఉన్నాయి. మర్యాదగా మావి మాకు పడేస్తే మంచిది” ఒకరోజు నీలకంఠం వచ్చి నిలదీశాడు.

అతగాడిని చూసేసరికి నిలువునా కుప్పకూలిపోయింది వర్ధని. నోట మాట కరువైపోయింది. తమని తమ జీవితాలని పూర్తిగా వీధిన పడేసిన దుర్మార్గుణ్ణి ఏదో చేసెయ్యాలన్నంత కసి నెలకొంది ఆమెలో.

“నువ్వేదో ఏడ్చి గీపెడితే లాభం లేదు ముసల్దానా! మిధున ఇప్పుడు నా సొత్తు. నా దగ్గరే ఉంటుంది. నాతోనే ఉండాలి కూడా.” నోటికి వచ్చినట్లు పేలుతున్నాడు నీలకంఠం.

సహనం చచ్చిపోతోంది వర్ధనిలో. ఉక్రోషం తన్నుకొస్తోంది. కానీ ఏమీ చేయలేని అసహా


వైస్ ఛాన్సలర్ నుంచి సత్కారం పొందుతున్న షేక్ అబ్దుల్ హకీం జాని



## మాంటిస్సోరి పబ్లిక్ స్కూల్ దశమ వార్షికోత్సవ సభలో షేక్ అబ్దుల్ హకీం జానీకి సత్కారం

ఇటీవల గుంటూరు జిల్లా తెనాలిలో కేరళ టీచర్ల ఆధ్వర్యంలో నడుస్తున్న మాంటిస్సోరి పబ్లిక్ స్కూల్ దశమ వార్షికోత్సవాన్ని కన్నుల పండుగగా జరిపారు. నాగార్జున విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎల్. వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఇదే విశ్వవిద్యాలయానికి చెందిన తెలుగు శాఖాధిపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, స్కూల్ ప్రిన్సిపాల్ జేమ్స్‌మోర్లే, కరస్పాండెంట్ జోస్ సెబాస్టియన్ ప్రభృతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాంటిస్సోరిలో గత *9* ఏళ్ళుగా తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, సహస్ర వ్యాసకర్తగా అందరి ప్రశంసలందుకున్న ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీం జానీని వైస్ ఛాన్సలర్ వేణుగోపాల్‌రెడ్డి దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు.

యత నెలకొంది ఆవిడలో. చాలా దీనంగా ఉంది ఆ స్థితి.

ఇరుగుపొరుగు నలుగురైదుగురు గుమికూడారు.

“అమ్మాయికి మొగుడు పోయాడు. వయసులో ఉంది. ఉప్పు కారాలు తినే శరీరం. ఎంతకాలం ఇలా ఉండగలదు. తనదారి తను చూసుకొని మంచి పనే చేసింది. దీంట్లో పెద్దగా తప్పు పట్టాల్సిన పనిలేదు. అందుచేత ఆమెకు చెందాల్సిన వస్తు సామాగ్రిని నీలకంఠంతో ఇచ్చి పంపించడమే న్యాయం” అందరూ ముక్త కంఠంతో తీర్పు చెప్పారు.

చేతులుడికిపోయాయి వర్ధనికి. మనసంతా కల్లోలం. ముక్కుపచ్చలారని పిల్లల్ని గాలికి ఒదిలేసి, బాధ్యతల నుండి పారిపోయింది. పోనీ పోతూ పోతూ వాళ్ళని కూడా వెంటేసుకుపోయిందా అంటే అదీ లేదు. పసివాళ్ళని తీసుకెళ్ళడానికి ఈ దరిద్రుడు ఒప్పుకోలేదేమో! అవును అది కావాలిగాని, దాని వెనుక బాధ్యతలు వాడికెందుకు? ఎంత కాదనుకున్నా మరీ ఇంత బరితెగింపా!”

చావడానికి సిద్ధంగా ఉంది తను. ఇద్దరు పిల్లల్ని ఎలా పెంచగలదు? అది తనవల్ల అయ్యే పనేనా? ఇక పెద్దకొడుకు ఇంటికి పోవడం తప్ప గత్యంతరం లేదు. ఎంత తమ్ముడి పిల్లలయితే మాత్రం సత్యంకి ఏం పడుతుంది? వాడు సరే అన్నా పెద్ద కోడలు ఒప్పుకోవద్దూ! అదీ దేశంకాని దేశంలో, ఎక్కడో కురుక్షేత్రంలో..”

ఎటు చూసినా కల్లోల కడలిలా ఉంది వర్ధని స్థితి. ఏదో లేని ఓపికను తెచ్చిపెట్టుకొని పసివాళ్ళని తనకు తెలిసిన చిన్న స్కూల్లో జాయిన్ చేసింది.

అవమానాల్ని దిగమింగుకుంటూ, అయినవారిని కోల్పోయి, ఉన్నవారికి దూరమై బండకన్నా బరువైన దుఃఖంతో బ్రతుకును వెళ్ళదీయడం తప్పడం లేదు వర్ధనికి.

❊ ❊ ❊

ఆ జంట హత్యలు మొత్తం జిల్లా పోలీసు యంత్రాంగాన్నే ఉలిక్కిపడేలా చేశాయి. ఇద్దరూ అతి కిరాతకంగా చంపబడ్డారు. ఆ దృశ్యం చాలా భయంకరంగా ఉంది. పత్రికలు ఆ హత్యల పూర్వాపరాలని పతాక శీర్షికల్లో ప్రముఖంగా ప్రచురించాయి. ఇతర మీడియా కూడా బాగా దృష్టిపెట్టాయి.

పోలీసు జాగిలాలను రంగంలోకి దింపారు. హంతకులకు సంబంధించిన వివరాలు ఏమీ వెలుగు చూడలేకపోయాయి. జిల్లా కలెక్టర్, యస్పీలు వచ్చి చూసి అధికారులకు ఆదేశాలు జారీ చేసి వెళ్ళారు.

మిధున నీలకంఠంలు హత్యకు గురికావడం మింగుడుపడటం లేదు వర్ధనికి. భయంతో కంపించిపోతోంది. పసివాళ్ళను వాటేసుకుని భోరున విలపిస్తోంది. ఎండిన మోడుపై పిడుగు పడ్డట్లుంది ఆమెకు. పోస్టుమార్టం పూర్తి అయింది. అతి కిరాతకమైన మర్డర్స్‌గా సర్టిఫై చేశారు డాక్టర్లు. ఇక పోలీసు డిపార్టుమెంట్ ఇన్వెస్టిగేషన్ మొదలైంది.

ఎస్.ఐ. కపర్ధీకి ఒక మంచి అలవాటు ఉంది. తాను పట్టిన కేసును ఆసాంతం ఇన్వెస్టిగేట్ చేయడం, నిజానిజాలను తెలుసుకోవడం. సాధ్యమైనంత త్వరగా వివరాలు రాబట్టాలనుకోవడం.. ఒక వేళ సరి అయిన సమాచారం, సాక్ష్యాలు లభించనప్పుడు తొందరగా ఫైల్ క్లోజ్ చేసేయడం అతని తరహా.

## గత చరిత్ర



**నేలలో నేను గతం**
**త్రవ్వితే**
**నీళ్ళు పెళ్ళుబికేయి**
**అవి గత చరిత్ర తాలూకు**
**నీళ్ళే కన్నీళ్ళే**
**ఆకాశంలో**
**నేను ఎగిరితే**
**అంతరిక్షం ఆశ్చర్యపోలేదు**
**అవి గత చరిత్ర తాలూకు**
**కాలుష్యమే**

**– జి శైలూషి**

అదే తరహాలోకి వచ్చేలా ఉంది ఈ హత్య కేసు. తీవ్రంగా పరిశీలించాడు. ఇన్వెస్టిగేషన్ త్వరితగతిని పూర్తిచేయించాలని నడుం బిగించాడు. ఎందరినో ప్రశ్నించాడు.

దానిలో అనుమానమున్న ఏ అంశాన్నీ ఒదిలిపెట్టలేదు. ఊర్లో ఉన్న రౌడీ షీటర్స్ అందర్నీ అదుపులోకి తీసుకున్నాడు. కనికరాన్ని పక్కనపెట్టి కర్రల్ని విరగగొట్టాడు. అదే లాఠీ కర్రల్ని ఝుళిపించాడు. దొంగలు దోపిడీదారులనందర్నీ అదుపులోకి తీసుకొని ప్రశ్నించాడు మొదట. హత్య జరగడానికి అవకాశమున్న అన్ని కోణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాడు.

వర్ధనిని తీసుకెళ్ళి ప్రశ్నించాడు. భయపెట్టాడు. తర్వాత భయం లేదు తెలిసిన సంగతులు చెప్పమని భరోసా ఇచ్చారు. ముసలితనం, ద్వేషాలు పట్టని జీవనవిధానం, వివాదాలు అసలు పట్టని పెద్దమనిషితనం అనే అంశాలు త్వరగా ఆవిడను కేసు నుండి బయటపడడానికి దోహదం చేశాయి.

పెద్దకొడుకు సత్యం, అతని భార్యను కురుక్షేత్రం నుండి పిలిపించారు. మంచి ఉద్యోగం, హోదా, వ్యక్తిత్వంగల అతనిలో క్రిమినల్ ఎలిమెంట్స్ ఏమీ కానరాలేదు.

“ఆయన్ని నేను చంపడమేమిటి? అసలు ఎప్పుడైనా ఎదురు మాట్లాడితే నన్ను బ్రతకనివ్వడు. మిధునను లేపుకొస్తున్నాను. అది ఇక నుండి మనతోనే ఉంటుంది. దానితోబాటు దాని సంపాదనా మనదవుతుంది నువ్వు నోరెత్తడానికి వీలు లేదు” అన్నాడు. నీలకంఠం భార్య అన్న మాటలు నమ్మశక్యంగానే ఉన్నాయి కపర్ధీకి.

ఆమెను ఇంటరాగేట్ చేస్తే ఆధారాలు దొరుకుతాయని మరలా మరలా పోలీస్ స్టేషన్‌కి పిలిపించాడు. నీలకంఠం పెట్టిన బాధల్ని ఏకరువుపెడుతోంది నీలిమ.

“ఆయన దుర్మార్గాలు ఎప్పుడూ నాకు కొత్త కావు. కానీ ఎవత్తెనో సవితిగా తీసుకొస్తానంటే మొదట్లో కష్టం అనిపించింది. ఒకసారి ధైర్యం తెచ్చుకొని నిలదీశాను. నా కంఠంలో ప్రాణం ఉండగా కుదరదన్నాను. అయితే ప్రాణం తీసేస్తానన్నాడు. మాటకు మాట మొదటిసారిగా చెప్పబోయాను.

ఆయనలో రాక్షసుడు కనిపించాడు.

నన్ను చెట్టుకు కట్టేసి చితక కొట్టాడు. కసితీరా తన్నాడు. నానా మాటలన్నాడు. మాటలు ఒప్పజెబితే చంపేస్తానని భయపెట్టాడు. పెళ్ళి అయిన దగ్గర్నుండీ ప్రతి విషయానికీ కట్టుకునేవాడి చేత తన్నులు తినడం నాకు అలవాటుగా మారిపోయింది. ఓర్చుకున్నాను. చివరకు రాజీపడ్డాను. కాకపోతే తనతోబాటు మగడి శారీరక అవసరాల కోసం మరొక ఆడది” నీలిమ స్టేట్‌మెంట్‌ని మరోసారి రికార్డు చేసుకున్నాడు కపర్ధీ.

ఆమె గుండెల్లోంచి వెలువడుతున్న నిస్సహాయత, వేదన, ఓ మధ్యతరగతి ఆడదానిలోని భయం భక్తి అణకువ కపర్ధీలాంటి చండశాసనుణ్ణి ఆలోచనలో పడేశాయి.

నీలకంఠం ఆఫీసులోని వాళ్ళని, స్నేహితుల్ని ఇరుగుపొరుగు వాళ్ళని అందర్నీ విచారించాడు. తరువాత మిధునకు తెలిసిన వాళ్ళనందరినీ ఇంటరాగేట్ చేశాడు.

చివరికి ఈ జంట హత్యల కేసు కపర్ధీ సామర్థ్యానికి ఓ సవాలుగా నిలిచింది. ఎంత దర్యాప్తు చేస్తున్నా చిక్కుముడి వీడడం లేదు. హంతకులు దొరకడం లేదు. లేకపోతే తాగిన మైకంలో మందు సీసాతో పొడుచుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారా?

జీవితంపైన విరక్తి చెందో, ఇరుగుపొరుగులవారి నుండి అవమానాల్ని భరించలేకో..

పోస్టుమార్టమ్ రిపోర్టు మట్టుకు ముమ్మాటికీ ఆత్మహత్య కాదు. ఇది హత్య అని చెబుతోంది. కసి తీరా పొడిచి చంపిన ఆధారాలు స్పష్టంగా మృతదేహాల వద్ద కనిపించాయి.

నిజానిజాల కొరకు ఎంతగానో ప్రయత్నించాడు కపర్ధీ. ఆసాంతం అవకాశమున్న ఏ అంశాన్నీ వదలకుండా విచారించాడు. చివరికి తన అలవాటు ప్రకారం సరి అయిన సమాచారం, సాక్ష్యులు లభించకపోవడంతో ఫైల్ క్లోజ్ చేసేందుకు సిఫార్సు చేశాడు.

జరిగిన మిస్టరీతో మరింత క్రుంగిపోయింది వర్ధని. హంతకులు దొరకనంత పకడ్బందీగా చంపబడ్డారు. అవమానాలతో అతలాకుతల మవుతోంది ఆవిడ. చివరకు సత్యం వచ్చి ఇల్లు అమ్మకానికి పెట్టాడు.

అక్కడ జ్ఞాపకాలన్నింటినీ తెంచుకోవడం, ఊరు నుండి శాశ్వతంగా దూరం కావడం తప్ప మరో గత్యంతరం కనబడలేదు.

❊ ❊ ❊

కదులుతూన్న రైలు నుండి స్టేషన్‌ను ఆత్మీయంగా చూసుకొంది వర్ధని. దారుణాలను అవమానాలను మూటగట్టుకొని శాశ్వతంగా వైదొలగుతోంది. మిధున నీలకంఠంలను హత్య చేసింది ఎవరు అనేది ఆనాటి నుండి ఈనాటి వరకు ఆవిడలో శేష ప్రశ్నగానే మిగిలిపోయింది.

ప్యాక్ చేసి పంపినవి పోగా మిగిలిన సామాన్లని సరిచూసుకున్నాడు సత్యం. స్టేషన్‌కి వచ్చిన ఒకరిద్దరు వీడ్కోలు చెప్పారు. అంతటి నిర్వేదనలోను నెమ్మదిగా మగత నిద్రలోకి జారిపోతోంది వర్ధని. కళ్ళు మూతలు పడుతున్నాయి. బుల్లి పెదనాన్న ఒడిలో తలపెట్టుకొని అప్పుడే కునుకు తీస్తున్నాడు.

బాలికి ఓ విధంగా ఆనందంగా ఉంది. కిటికీ నుండి దూసుకొస్తున్న ఈదురుగాలి ఆ ఆనందానికి ఆలంబనగా నిలుస్తోంది. ఇన్నాళ్ళూ నాయనమ్మ తమ కోసం పడిన కష్టం గుర్తుకు వస్తోంది బాలికి. నాన్న మంచానపడి చనిపోవడం, అమ్మ ఉందికదా' అనుకున్నప్పుడు ఆమె అమ్మగా ప్రవర్తించక పోవడం తన బాధ్యతను విస్మరించడం అన్నీ సినిమా రీలులా కళ్ళముందు కనిపిస్తున్నాయి.

ఆనాడు అమావాస్య. చిక్కటి చీకటి. అంతా నిశ్శబ్దంగా ఉంది బయట. స్కూలు నుండి బుల్లి ముందే వచ్చేశాడు. మిగతా పిల్లలందర్నీ వాళ్ళ వాళ్ళ మమ్మీలు డాడీలు వచ్చి తీసుకుపోయారు. ఇక మిగిలింది తను... మమ్మీ అంటూ డాడీ అంటూ ఎవరూ లేని తను.

జన సంచారం లేదు. చడీచప్పుడూ వినిపించని ఆ రోడ్డు మీద ఒంటరిగా నడిచి వస్తున్నాడు బాలి. రాత్రి తొమ్మిది గంటల వరకు స్టడీ అవర్స్ కావడంతో చాలా అలసటగా ఉంది. చదివేది మూడో తరగతి. కానీ భుజాన బండెడు పుస్తకాలు.

వెనుక నుండి దూరంగా స్కూటర్ శబ్దం. సెకన్లలో ఆ శబ్దం దగ్గర అవుతోంది. వచ్చి తనను ఢీ కొట్టాడు ఆ స్కూటర్ వాలా. కింద పడబోయి తమాయించుకొని లేచాడు బాలి. చేతికి అంటుకున్న దుమ్మును దులుపుకున్నాడు. అంతటి చీకటిలోనూ స్కూటర్ వెనుక వ్యక్తి స్పష్టంగా కనిపిస్తోంది బాలికి.

"మమ్మీ" ఆనందంగా అరిచాడు. ఆ క్షణంలో తాను కిందపడబోయిన సంగతి మరిచిపోయాడు.

"మమ్మీ" మరోసారి కేకవేశాడు.

"ఫోనీ త్వరగా" నిర్లక్ష్యంగా బాలి వైపు చూసి తల తిప్పుకుంది మిధున. అంతే స్కూటర్ మరింత వేగంతో ముందుకు సాగిపోయింది.

తల్లి ముఖంలోని నిరాదరణ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది బాలిని. తనను తాను తమాయించుకో లేకపోయాడు. తాను రోజూ టీవీల్లో సినిమాల్లో చూసే ఫైటింగ్ సీన్లు, చంపుకొనే దృశ్యాలు, హారర్ ఇతివృత్తాలు, నరుక్కునే సంఘటనలు గుర్తుకు వచ్చాయి. ఉద్రేకంతో ఊగిపోయాడు బాలి.

మనుషుల్ని ఎంత చక్కగా మోసం చేయ వచ్చో చూశాడు. ఎంత ఘరానాగా చంపవచ్చో టీవీలద్వారా తెలుసుకున్నాడు. చంపి ఎలా కన్నుగప్పి తప్పించుకోవచ్చో నేర్చుకున్నాడు.

మొండి ధైర్యంతో ఇంటికెళ్ళాల్సిన బాలి ఆ స్కూటర్‌ను వెంబడించాడు. అప్పటికే నీలకంఠం తాగిన మైకంలో పూర్తిగా మునిగిపోయి ఉన్నాడు. మిధున కూడా అతని పక్కనే పడుకొని ఉంది. అక్కడ వాళ్ళిద్దరూ తప్ప ఇంకెవరూ కనిపించడం లేదు.

'ఫెళ్' పక్కనే ఉన్న విస్కీ బాటిల్ బాలి చేతిలో పగిలిపోయింది. పగిలిన సీసాతో ఇద్దర్నీ కసితీరా పొడిచి చంపాడు. ఎవరికీ అనుమానం రాకుండా అక్కడే స్నానం చేసి వెంటనే ఇంటికి చేరాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో హత్యల విషయం మరునాడు మధ్యాహ్నంగాని వెలుగు చూడలేదు. బుడతడు అయిన కారణంగా బాలి మీద ఎవరికీ అనుమానం రాలేదు. ఇక రాదు కూడా.

విరిసీ విరియని వయసులోనే అది ఓ భయంకరమైన చీకటి కోణం బాలికి. తనను హంతకుడని ఎవరూ గుర్తించకపోయినా ఆ నిర్వాకం జీవితాంతం వెంటాడి తనని బాధ పెడుతూనే ఉంటుంది.

కానీ తాను చేసిన పనికో తెలియని ప్రయోజనమేదో కనిపిస్తోంది బాలికి. ఆ ఊహ ఎంతో కొంత సంతృప్తిని ఆనందాన్ని కలగజేస్తోంది వాడిలో. తనవారి ముఖాలలోకి చూశాడు. అలిసిపోయి ఉన్నారు. ప్రస్తుతం గతానికి దూరంగా జరిగిపోతున్నారు.

"అక్కడ మరో మంచి జీవితాన్ని నిర్మించుకోవాలి" అలా అనుకోవడంలో ఆ ఎనిమిదేళ్ళ బాలిలో ఎనభై ఏళ్ళ మెచ్యూరిటీ కనిపిస్తోంది.

అతని ఊహలకు సై అన్నట్లు ఆ రైలు వేగాన్ని మరింతగా పెంచుతోంది. ❊

## వి'చిత్ర' వ్యాఖ్య పోటీ ఫలితం - 56

మేము నిర్వహిస్తున్న వి'చిత్ర' వ్యాఖ్య పోటీలో మా ఊహకు మించి పాఠకులు పాల్గొని వ్యాఖ్యలు పంపారు. అందరికీ మా అభినందనలు. మాకు వచ్చిన (9-2-2005 సంచిక) వ్యాఖ్యలలో ఈ క్రింది వ్యాఖ్యను ఉత్తమంగా ఎన్నిక చేశాము.



**గురి చూసి కొట్టాలి కిరీటీ**

**అరిమూక సమసితేనే అందలం!**

పంపినవారు

కె. వీరభద్రరావు, తెనాలి

వీరికి ప్రియదత్త వారపత్రిక మూడు మాసాల పాటు అందజేస్తాము.

- ఎడిటర్